క్లుప్తంగా

ఇరిగేషన్ కార్యాలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల: పట్టణంలోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న కార్యాలయాన్ని, పరిసరాలను ఆయన పరిశీలించి అధికారులతో మాట్లాడారు. భవిష్యత్‌లో ఎప్పటికైనా ప్రమాదాలు జరగవచ్చని, భవనానికి చేయాల్సిన మరమ్మతుల విషయంపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అలానే సమీపంలోని మహిళా మండలి ఆవరణలోని వృద్ధుల ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఆశ్రమంలోని వృద్ధులతో కొద్దిసేపు మాట్లాడి పండ్లు పంపిణీ చేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు మామిడాల రాములు, గోలి స్వాతి, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు చిన్నమల్లవరంలో ఉచిత వైద్య శిబిరం

జే.పంగులూరు: మండల పరిధిలోని చిన్నమల్లవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సోమవారం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరం ఒంగోలు కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో నిరహిస్తున్నారు. శిబిరంలో ఎముకలు, కీళ్లు, నరాలు, కంటి చూపు, గుండె, గ్యాస్ట్రబుల్, సాధారణ వ్యాధులకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తారు. షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఇస్తారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు, రైస్ కార్డు ఉన్నవారికి హాస్పటల్‌లో ఉచిత వైద్య సేవలు అందిస్తారు.

ఉచిత వైద్య శిబిరం పేదలకు వరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది, వైద్యులు

కారంచేడు: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నాయకుడు, పర్చూరు ఏఎంసీ మాజీ చైర్మన్ జువ్వా శివరామ్‌ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కుంకలమర్రు తుఫాన్ షెల్టర్ ప్రాంగణంలో జువ్వా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ సహకారంతో ఈ క్యాంపు నిర్వహించామన్నారు. ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ సహకారంతో గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరంలో గుండె, ఎముకలు, కీళ్లు, నరాలు చర్మ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హాస్పటల్ డాక్టర్ రామాంజనేయులు, సునీల్, డాక్టర్ ప్రీతి, డాక్టర్ రాణి, సిబ్బంది సహకారంతో సుమారు 450 మందికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఇంటి నిర్మాణలపై అవగాహన అవసరం



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీడీవో

బల్లికురవ: ప్రభుత్వం జగనన్న కాలనీలు సొంత స్థలాలకు మంజూరు చేసిన ఇంటి నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయాలని ఎంపీడీవో సీహెచ్‌కృష్ణ కోరారు. సోమవారం సాయంత్రం స్థానిక పరిషత్ కార్యాలయంలో 20 సచివాలయాల సెక్రటరీలు ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 294 ఇళ్లు గ్రౌండింగ్ చేయగా ఇంకా 64 ఇళ్లు నిర్మాణానికి నోచుకోలేదన్నారు. తక్షణమే గ్రామాలవారీగా లబ్ధిదారులకు అవగాహనతో నిర్మాణ పనులు చేపట్టాలని ఎంపీడీవో కోరారు. సమీక్షలో ఈవోఆర్డీ జీ. సీతామహాలక్ష్మి, వెలుగు ఏపీఎం సురేంద్రబాబు, హౌసింగ్ ఏఈ దుర్గా రమేష్, పాల్గొని మాట్లాడారు.

విద్యుత్ బకాయిలు వసూళ్లు చేయాలి

అద్దంకి రూరల్: అద్దంకి డివిజన్ పరిధిలో ఉన్న విద్యుత్ బకాయిలను సత్వరమే వసూళ్లు చేయాలని ఎస్సీ కేవీజీ సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక రామ్‌నగర్‌లోని కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సీ మాట్లాడుతూ ఎండా కాలం దృష్టిలో ఉంచుకుని అంతరాయంలేని నాణ్యమైన విద్యుత్‌ను ప్రజలకు అందించాలన్నారు. పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. డివిజన్ పరిధిలో విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఏడుగురిని విధులనుంచి తొలగించారు. కార్యక్రమంలో డీ మస్తాన్ రావు, ఏడీ టీ. సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక హంగులు..
అందరికీ వైద్యం

- జిల్లాలో అతిపెద్ద ధర్మాసుపత్రిగా చీరాల వైద్యశాల
- రాత్రి సమయాల్లో కూడా అత్యవసర సేవలు
- రోజుకూ 200 నుంచి 300 మంది రోగులకు సేవలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రోగులు



చీరాల రూరల్: పేదల సంక్షేమంతో పాటు ఆరోగ్యం కూడా అవసరమని సీఎం జగన్ మోహన్‌రెడ్డి తన ప్రసంగంలో ఎప్పుడూ నొక్కి వక్కాణిస్తుంటూనే ఉంటారు. నాడు–నేడు తరహాలో ఆస్పత్రులను సైతం బాగుచేసి చిత్తశుద్ధి నిరూపించుకుంది ప్రభుత్వం. అంతేకాకుండా ఆత్యాధునిక వైద్య పరికరాలు, కొత్త భవనాలను సైతం నిర్మిస్తూ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించాడు సీఎం జగన్. బాపట్ల జిల్లాలో అతిపెద్ద ధర్మాసుపత్రిగా చీరాల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల విరాజిల్లుతోంది. జిల్లా ఏర్పడక ముందు చీరాల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల ప్రకాశం జిల్లాలో అంతర్భాగంగా ఉండేది. ప్రకాశం జిల్లా హెడ్ క్వార్టర్ ఒంగోలులో ఉన్న ప్రభుత్వాసుపత్రి జిల్లాలోనే పెద్దాసుపత్రిగా పేరుగాంచింది. అయితే చీరాల మాత్రం రెండో అతిపెద్దాసుపత్రిగా ముద్రవేసుకుంది. ప్రస్తుతం బాపట్ల జిల్లా ఏర్పడిన తరువారం విస్తీర్ణంలోనూ వైద్య రోగులకు వైద్య సేవలను అందించడంలోనూ బాపట్ల జిల్లాలోనే చీరాల ప్రాంతీయ వైద్యశాల పెద్దాసుపత్రిగా అవతరించింది.

అత్యాధునిక హంగులతో వైద్య సేవలు

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య స్మారక 100 పడకల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల రోగుల పాలిట సంజీవనిలా నిలుస్తోంది. చీరాల, చీరాల పరిసర ప్రాంతాలకు చెందిన రోగులు నిరంతరం ఈ వైద్యశాలకు వైద్య సేవల నిమిత్తం ఆశ్రయిస్తారు. ప్రతిరోజు 200 నుంచి 300 మంది వరకు రోగులు వైద్య సేవలు పొందుతుంటారు. మూడేళ్ల క్రితం రూ.9 కోట్లతో ఆస్పత్రి పాత భవనాల వెనుక నూతనంగా ఆస్పత్రి నిర్మాణాలు చేశారు. ఈ నూతన నిర్మాణాల్లో అత్యవసర సేవా విభాగంతో పాటు అన్ని విభాగాలను ఇక్కడే నిర్వహిస్తున్నారు. కోవిడ్ సమయంలోపై అంతస్తు మొత్తాన్ని కోవిడ్ బాధితులకు వైద్య సేవలందించేందుకు ఉపయోగించారు. అలానే రోగులకు అత్యవసర సమయంలో ఆక్సిజన్ అందించేందుకుగాను గతంలో ఇతర ప్రాంతాల నుంచి సిలిండర్లను దిగుమతి చేసుకునేవారు. ప్రస్తుతం రూ.1 కోటికి పైగా వెచ్చించి ఆస్పత్రి ఆవరణలోనే ఆక్సిజన్ ప్లాంట్ నెలకొల్పారు. కోవిడ్ సమయంలో అయితే రోగులకు ఎంతగానో ఈ ప్లాంట్ ఉపయోగపడింది.

ఆధునిక సౌకర్యాలతో కాన్పుల వార్డు..

జిల్లా ఆస్పత్రికి ఏ విధమైన హంగులు కావాలో చీరాల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు అన్ని హంగులు ఉన్నాయి. వాటిలో సీమాంక్ సెంటర్ అతి ముఖ్యమైనది. తల్లీబిడ్డల సీమాంక్ సెంటర్ 30 పడకలతో కాన్పుల వార్డు నిర్మాణం చేశారు. కాన్పుల కోసం వేలకు వేలు ఖర్చుచేసి ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించలేని నిరుపేద గర్భిణులు సీమాంక్ సెంటర్లో చేరి గైనిక్ వైద్యుల నిరంతరం పర్యవేక్షణలో సురక్షితంగా కాన్పులు చేయించుకుంటున్నారు. అలానే ఆస్పత్రిలో ఉన్నన్ని రోజులు భోజనం కూడా ఉచితంగా అందిస్తున్నారు.

కిడ్నీ బాధితుల కోసం దయాలసిస్ యూనిట్..

గతంలో ఒంగోలుకు మాత్రమే పరిమితమైన కిడ్నీ బాధితులకు ఉపయోగపతున్న డయాలసిస్ యూనిట్‌ను చీరాల ప్రభుత్వాసుపత్రిలో నెలకొల్పారు. కిడ్నీ సమస్యల బారిన బాధితులు ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఒంగోలు, గుంటూరు వంటి పెద్దాసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేది. కిడ్నీ సమస్యల బారిన బాధితులకు నెలలో రెండు నుంచి మూడుసార్లు డయాలసిస్ చేయాల్సి వచ్చేది. దీని వలన నిరుపేదలు ఎంతో ఖర్చుచేసి పెద్దాసుపత్రులకు తిరిగేవారు. ప్రస్తుతం చీరాల ప్రభుత్వాసుపత్రిలోనే డయాలసిస్ యూనిట్ నెలకొల్పడంతో పాటు సీఎం జగన్ మోహన్‌రెడ్డి డయాలసిస్ చేయించుకుంటున్న బాధితులకు నెలకు రూ. 10 వేలు పింఛన్ అందిస్తున్నారు. రక్తనిధి కేంద్రం, ఏఆర్టీ సెంటర్, సీటీ స్కాన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

భోజనశాల, విశ్రాంతి గదులు..

ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుకునే రోగుల సౌకర్యార్థం వాడరేవుకు చెందిన రామానంద సరస్వతి ఆధ్వర్యంలో ఆస్పత్రి ఆవరణలో రూ. 5 లక్షలు ఖర్చుచేసి భోజనశాల, విశ్రాంతి గదులు ఏర్పాటు చేశారు. అలానే మంచినీరు తాగేందుకు ఆర్‌ఓఆర్ మంచినీటి ప్లాంట్‌కూడా ఏర్పాటు చేశారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆస్పత్రి ఆవరణలోనే అన్ని వసతులు సమకూరినట్లయ్యింది.

పోలీసు ఔట్‌పోస్టు విభాగం..

కొట్లాటలు, రోడ్డు ప్రమాదాల బారినపడిన బాధితులు, అగ్ని ప్రమాదాల బారిన బాధితులను ఈ ప్రభుత్వాసుపత్రి అక్కున చేర్చుకుంటుంది. 108 వాహనంలో వచ్చే బాధితులకు వైద్యుల పర్యవేక్షణలో వైద్యసేవలందించడమే కాకుండా గాయాల పాలైన బాధితులకు వారి దెబ్బల తీవ్రతలను బట్టి వైద్యులు ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించి బాధితుల నుంచి ఫిర్యాదులు కూడా స్వీకరిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు కూడా ఆస్పత్రి ప్రాంగణంలో ఉండడంతో అన్ని సమయాలలో పోలీసులు రోగులకు ఎంతో రక్షణగా ఉంటున్నారు. వీరికి తోడు అస్పత్రిలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులను కూడా ఏర్పాటు చేశారు. వీరు ముగ్గురు చొప్పున మూడు షిఫ్టుల్లో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు.



ఆస్పత్రిలోని తల్లీబిడ్డల కాన్పుల వార్డు



రోగులకు ఉచితంగా భోజనం అందిస్తున్న సిబ్బంది

> **ఆస్పత్రిని అభివృద్ధి చేస్తున్నాం..**
> బాపట్ల జిల్లా ఏర్పడ్డాక మన చీరాల ప్రభుత్వాసుపత్రే జిల్లాలో పెద్దాసుపత్రి. ప్రభుత్వాసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం. రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. రోగులు ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి.
> – డాక్టర్ శేషుకుమార్, ఆస్పత్రి పర్యవేక్షకుడు.

నేటి నుంచి విద్యార్థులకు రాగి జావ

కారంచేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు మరో వరం అమలు చేసింది. విద్యార్థులు ఐరన్ లోపంతో ఉన్నట్లు గుర్తించిన ప్రభుత్వం మంగళవారం నుంచి రాగి జావను ప్రవేశపెడుతుందని ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు అవసరమైన రాగి పిండి, బెల్లం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 14 గ్రామాల్లో 34 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, వీటిలో 1921 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. వీరందరికీ మంగళవారం ఉదయం 8:45 నిమిషాలకు ఈ రాగి పిండితో సిద్ధం చేసే రాగి జావను అందిస్తామన్నారు. కార్యక్రమాన్ని హెచ్‌ఎంలు పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఒక్కో పాఠశాలకు 5 కేజీల చొప్పున రాగి పిండి, 5 కేజీల చొప్పున బెల్లంతో ఉన్న ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ



బాలికలకు పౌష్టికాహారం అందజేస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు: రోటరీ క్లబ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో పర్చూరు బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి బాలికలకు పబ్లిక్ పరీక్షలు ముగిసే వరకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. పదో తరగతి చదివే బాలికలు బాగా కష్టపడి చదివి పరీక్షలు బాగా రాయాలని, మంచి ఉన్నత స్థానంలో నిలవాలని శ్రీనివాసరావు కోరారు. పదోతరగతి చదివే బాలికలకు పౌష్టికాహారాన్ని దాత రొటేరియన్ నర్రా వెంకటేశ్వర్లు, లక్ష్మీసుధ ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, రోటరీ సభ్యులు తోకల కృష్ణమోహన్, గడ్డిపాటి శ్రీనివాసరావు, కాసా అశోక్, కొల్లా సుబ్బారావు, వెంకన్న, చంద్రం, హెచ్‌ఎం అవని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైద్రాబాద్ ప్రయాణం ఇక సుఖమయం

- నాన్ ఏసీ స్లీపర్ సర్వీసులు ప్రారంభం
- పాల్గొన్న ఎమ్మెల్యే కరణం బలరాం



స్లీపర్ బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల అర్బన్: చీరాల నుంచి హైద్రాబాద్ వెళ్లే ప్రయాణికులకు ప్రయాణాన్ని ఆర్టీసీ మరింత సుఖమయం చేసిందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. చీరాల ఆర్టీసీ డిపోకు చెందిన రెండు నాన్ ఏసీ స్లీపర్ బస్సులను సోమవారం ఆయన ప్రారంభించారు. చీరాల నుంచి హైద్రాబాద్‌కు, హైద్రాబాద్ నుంచి చీరాలకు ఈ సర్వీసులను కేటాయించారు. బస్సులను ప్రారంభించిన అనంతరం ఆయన బస్సు లోపల బెర్తులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటివరకు హైద్రాబాద్ వెళ్లే బస్సులకు సీటింగ్ సర్వీస్ మాత్రమే ఉండేదని, ప్రస్తుతం సెమీ స్లీపర్ సర్వీసులు ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రయాణికులందరూ ఆర్టీసీ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. డిపో మేనేజర్ జె.శ్యామల మాట్లాడుతూ హైద్రాబాద్ వెళ్లే ప్రయాణికులకు వీలుగా రెండు సెమీ స్లీపర్ సర్వీసులను నడుపుతున్నామన్నారు. ప్రతిరోజు రాత్రి 11 గంటలకు చీరాల నుంచి బీహెచ్‌ఈఎల్‌కు, బీహెచ్‌ఈఎల్ నుంచి రాత్రి 11 గంటలకు ఈ సర్వీసులు ప్రారంభమవుతాయన్నారు. బెర్తుల్లో ప్రయాణించడం వలన ప్రయాణం సుఖమయంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి విగ్రహాలు రెడీ



సిద్ధంగా ఉన్న సీతారాముడు, లక్ష్మణుడు, హనుమంతుడి విగ్రహాలు

చీరాల టౌన్: ఈనెల 30న శ్రీరామనవమి పండుగ సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లోని వాడల్లో చలువ పందిళ్లల్లో శ్రీరాముడు కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణానికి కావాల్సిన అందమైన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను రాజస్థాన్ కళాకారులు సిద్ధం చేశారు. మండలంలోని ఈపురుపాలెం, సాల్మన్‌సెంటర్, దేవాంగపురి గ్రామ పంచాయతీల్లో రాజస్థాన్ విగ్రహ తయారీదారులు వివిధ సైజుల్లో అందమైన శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడు విగ్రహాలను తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారు. అడుగున్నర ఎత్తు నుంచి మూడున్నర అడుగుల ఎత్తు వరకు ఉన్న మిరుమిట్లు గొలుపుతున్న అందమైన విగ్రహాలను కొనుగోలు చేసేందుకు ఉత్సవ కమిటీ వారు ఉత్సాహం చూపుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో రామారావు

మేదరమెట్ల: జిల్లా కేంద్రం బాపట్లలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి ఈఎండీపీ ప్రాజెక్ట్ పోటీల్లో కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనపరచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు సైన్స్ ఉపాధ్యాయుడు పోతురాజు తెలిపారు. ఎం.సాయి, జీ.చరణ్‌తేజ, జీ.సాయితేజలు ప్రదర్శించిన ప్రాజెక్టులు పలువురిని ఆకట్టుకున్నాయి. పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాటు సైన్స్ ఉపాధ్యాయుడు పోతురాజును డీఈవో రామారావు, ఈఎండీపీ రమణి, డీఎస్‌వో సాధిక్‌లు అభినందించారు. ఈనెల 24న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో పాల్గొంటారని ఉపాధ్యాయులు తెలిపారు.

పథకాల వినియోగంతో స్వయం ఉపాధి



మాట్లాడుతున్న ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ సురేశ్

అద్దంకి: ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో స్వయం ఉపాధి పొందవచ్చని మెప్మా సీఎంఎం ఫణికుమారి అన్నారు. పట్టణంలోని మెప్మా కార్యాలయంలో సోమవారం ఆమె మెప్మా మహిళలకు ప్రభుత్వ పథకాలపై (స్వనిధి సమృద్ధి క్యాంప్)అవగాహన ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని గత ఎనిమిది రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సీఎంఎం మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఏమి అవసరం ఉందో గుర్తించే సర్వే చేస్తున్నట్లు చెప్పారు. అవసరాన్ని బట్టి మెప్మా పరిధిలోని కుటుంబాలకు అవసరమైన పథకం ద్వారా లబ్ధి చేకూర్చేందుకు శిక్షణ సమావేశాన్ని గత ఎనిమిది రోజులుగా నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇండియాన్ బ్యాంక్ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ సురేశ్ మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం సురక్ష సమృద్ధి యోజన, జన్‌ధన్ యోజన, సుకన్యా సమృద్ధి యోజన వంటి పథకాల ద్వారా రుణాల పొంది మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి కుటుంబాన్ని వృద్ధి చేసుకోవచ్చన్నారు. తీసుకున్న రుణం సకాలంలో చెల్లిస్తుంటే మరలా మరలా రుణం ఇస్తామని చెప్పారు. డిఫాల్టర్ కాకుండా రుణకంతులు చెల్లించాలని చెప్పారు. కార్యక్రమంలో పట్టణంలోని మెప్మా మహిళలు పాల్గొన్నారు.

క్రమంతప్పని వ్యాయామంతో ఆరోగ్యం

అద్దంకి: క్రమంతప్పని వ్యాయామ చికిత్సతో ప్రత్యేక అవసరాల పిల్లల అవయవాల్లో కదలిక వస్తుందని ఫిజియోథెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. ఆమె సోమవారం స్థానిక భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు చిన్నచిన్న లోపాలుండటం సహజమన్నారు. వారికి ఫిజియోథెరపీ ద్వారా చికిత్స అందించడం ద్వారా కదలిక రావడంతో, వారు పక్కవారిపై ఆధారపడే పని లేకుండా తమంట తాము పనులు చేసుకునే విధంగా చేయవచ్చని చెప్పారు. ప్రతి రోజూ భవిత కేంద్రానికి తీసుకొస్తే వారికి అవసరమైన చికిత్సతోపాటు, భవిత కేంద్రంలో ఐఈఆర్‌టీలు విద్యను అందిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నియోజకవర్గ బీసీ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



మాట్లాడుతున్న సంఘ నాయకుడు

అద్దంకి: నియోజకవర్గ బీసీ కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక సమావేశంలో పట్టణంలోని భవానీ సెంటర్ సమీపంలోని గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో సోమవారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా తన్నీరు శ్రీనివాసరావు, అధ్యక్షుడుగా షేక్ షకీల్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా వినుకొండ వెంకట సుబ్బారావు, మన్యం శ్రీనివాసరావు, కొటికలపూడి శ్రీను, మీసాల సామ్రాజ్యం, అద్దంకి శ్రీనివాసరావు, అద్దంకి రమేశ్, ఏల్చూరి వీరాంజనేయులు, దగ్గు ఆదినారాయణ, సోమవరపు సత్యనారాయణ, మురారి యాదవ్, దాచేపల్లి వెంకట మారుతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



మార్జిన్‌లో పడిపోయిన క్షతగాత్రులు

మార్టూరు: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం సాయంత్రం ఇసుకదరిశి సమీపంలో జరిగింది. హైవే అంబులెన్స్, ప్రభుత్వాసుపత్రి సిబ్బంది వివరాల మేరకు.. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం కొండ్రుపాడు గ్రామానికి చెందిన ఆదినారాయణ, సుబ్బారావులు ద్విచక్రవాహనంపై ఒంగోలు వైపు నుంచి మార్టూరు వైపు వస్తున్నారు. ఇసుక దరిశి ఫ్లైఓవర్ దిగే దగ్గర వీరి వాహనాన్ని నాలుగు టైర్ల ఆటో ఢీకొట్టడంతో ఇద్దరు రోడ్డు పక్కన డివైడర్‌ను ఢీకొట్టి కింద పడిపోయారు. ప్రమాద తీవ్రతకు సుబ్బారావు కోమాలోకి వెళ్లగా ఆదినారాయణకు రెండు కాళ్లు విరిగాయి. హైవే అంబులెన్స్ సిబ్బంది మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువులు వారిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు.

ఆటో బోల్తా, డ్రైవర్‌కు గాయాలు

బల్లికురవ: నల్లచెరుకు గడలను తరలిస్తున్న మినీ వాహనం మలుపులో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటన సోమవారం కొప్పరపాడు–వినుకొండ ఆర్‌అండ్‌బీ రోడ్డులోని గొర్రెపాడు గ్రామ సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం గొర్రెపాడు నుంచి చెరుకు గడలను వేసుకుని నరసరావుపేట వైపు వెళ్తుడగా అదుపుతప్పి బోల్తా కొట్టటంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రైతులు హుటాహుటిన ఘటనా ప్రదేశానికి చేరుకుని డ్రైవర్‌ను గడలను బయటకు తీశారు. ట్రాక్టర్ల సహాయంతో రోడ్డు మార్జిన్‌లోకి బోల్తా కొట్టిన వాహనాన్ని బయటకు తీశారు.

పిడుగుపడి వరి ధాన్యం దగ్ధం



చినగంజాం: వరి చేలో పిడుగు పడటంతో పంటకోసి ఉంచిన వరిధాన్యం పూర్తిగా తగులబడింది. ఈఘటన ఆదివారం అర్ధరాత్రి సమయంలో చోటు చేసుకుంది. బాధితుడు ఆట్ల లక్ష్మీనారాయణ రెడ్డి అందించిన సమాచారం ప్రకారం పెదగంజాం ఇరిగేషన్ కింద ఒక ఎకరా భూమిలో వరి పండించాడు. రెండు రోజులు క్రితం పంట నూర్పిడు చేసి ధాన్యాన్ని బస్తాలలో నిల్వ ఉంచాడు. ఆదివారం అర్ధరాతి పిడుగు పడి పొలంలో నిల్వ ఉంచిన ధాన్యం పూర్తిగా దగ్ధమైపోయింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలను ఆర్పి అదుపులోనికి తీసుకువచ్చారు. సుమారు 40 బస్తాలు వరిధాన్యం దగ్ధం కాగా రూ.70 వేలు నష్టం సంభవించింది. స్థలాన్ని వ్యవసాయాధికారి కే భాస్కరరావు వచ్చి పరిశీలించారు. ఉన్నతాధికారులకు జరిగిన నష్టాన్ని పంపనున్నట్లు వ్యవసాయాధికారి తెలిపారు.

హెచ్‌ఐవీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ

చీరాల అర్బన్: పట్టణంలోని మహిళా మండలిలోని టీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 25 మంది హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు సోమవారం న్యూట్రిషియన్ ఫుడ్‌ను మహిళా మండలి ప్రెసిడెంట్ జాగర్లమూడి లక్ష్మీపద్మావతి చేతుల మీదగా అందించారు. పౌష్టికాహారం కోసం రూ.5 వేలను పి.ఉదయ్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో ఆశ రేఖ, మహిళా మండలి అధ్యక్షురాలు నాగేంద్రమ్మ, సభ్యులు, టీఐ ప్రాజెక్టు సిబ్బంది పి.జ్యోతి, కె.జ్యోతి, డి ధనమ్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.